క్లుప్తంగా

నేడు పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్‌లోని వెస్టర్న్ హిల్స్ సొసైటీ, అడ్డగుట్ట కాలనీ, సమత నగర్ కాలనీల్లో పార్కుల అభివృద్ధికి పీఏసీ చైర్మన్ గాంధీ గురువారం శంకుస్థాపన చేయనున్నట్లు కార్పొరేటర్ నార్నే శ్రీనివాస రావు తెలిపారు. ఉదయం 10:30 గంటలకు వెస్టర్న్ హిల్స్ సొసైటీ అడ్డగుట్ట 9వ లైన్‌లో ఉన్న పార్కులో రూ.51.40 లక్షల అంచనా వ్యయంతో పార్కు అభివృద్ధి పనులు, ఓపెన్ జిమ్ నిర్మాణ పనులకు, ఉదయం 10:45 గంటలకు సమత నగర్ వార్డు కార్యాలయం ఎదురుగా ఉన్న చిన్న పార్కులో 68.60 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

21న ఎన్‌కేఎన్‌ఆర్ గార్డెన్‌లో యోగా డే వేడుకలు



మాధవరం కాంతారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎన్‌కేఎన్‌ఆర్ గార్డెన్స్‌లో 21న నిర్వహించే యోగా డే వేడుకల్లో అధిక సంఖ్యలో పాల్గొనాలని కూకట్‌పల్లి స్వచ్ఛ అభియాన్ వ్యవస్థాపక అధ్యక్షులు మాధవరం కాంతారావు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మానసిక ప్రశాంతత, శారీరక పటుత్వం పెంచేందుకు యోగా దోహదపడుతుందని అన్నా రు. యోగా డే లో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సన్నబియ్యం పంపిణీ ఘనత కాంగ్రెస్‌దే

కూకట్‌పల్లి: తెలంగాణలో సన్నబియ్యం పంపిణీ ఘనత కాంగ్రెస్‌దేనని యువజన కాంగ్రెస్ నాయకుడు గాదె శివచౌదరి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. సన్నబియ్యం పంపిణీ బీజేపీదే అని ఆ పార్టీ నాయకులు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడ కూడా సన్న బియ్యం పంపిణీ చేయడం లేదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ సన్నబియ్యం పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తుందన్నారు. దీన్ని ఓర్వలేకనే విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మూడవ ర్యాంకు సాధించిన విద్యార్థినికి సన్మానం



విద్యార్థినిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం విద్యార్థిని జ్యోతి 470కి 466 మార్కులు సాధించి రాష్ట్రంలో మూడవ ర్యాంకు సాధించింది. బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థినిని సన్మానించారు. ప్రభుత్వ కళాశాలలో చదివి రాష్ట్ర స్థాయిలో మూడవ ర్యాంకు సాధించటం అభినందనీయమని అన్నారు. ప్రతి విద్యార్థి ఇష్టపడి చదవాలని, అప్పుడే విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో ఈ సెట్ కౌన్సెలింగ్



బాలానగర్: జేఎన్‌టీయూలో ఈ సెట్ కౌన్సెలింగ్‌లో రెండవ రోజు 405 మంది హాజరయ్యారు. 480 మంది ధృవపత్రాల పరిశీలనకు రావాల్సి ఉండగా 75 మంది విద్యార్థులు రాలేదు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్ర వరకు ధృవపత్రాల పరిశీలన కొనసాగినట్లు అడ్మిషన్స్ విభాగం డైరెక్టర్ బాలు నాయక్ తెలిపారు.

నాన్ లోకల్ సమస్య

కౌన్సిలింగ్‌కు హాజరైన కొందరు అభ్యర్థులకు లోకల్, నాన్‌లోకల్ సమస్య తలెత్తింది. తెలంగాణలో నాలుగు సంవత్సరాలు పైబడి విద్యను అభ్యసించి ఉండాలి. లేదా తల్లిదండ్రులు 10 సంవత్సరాలు పైబడి తెలంగాణలో నివాసం ఉంటే వారికి రెసిడెన్షియల్ సర్టిఫికెట్ తెలంగాణ రాష్ట్రంలో ఉన్నట్లు ఉండాలి. పైన తెలిపిన రెండు అర్హతలు కాని వారికి ఈ సెట్‌లో మంచి ర్యాంకు వచ్చినప్పటికీ తెలంగాణలో సీటు కౌన్సెలింగ్‌లో రాదు. బుధవారం ముగ్గురు విద్యార్థులు జేఎన్‌టీయూలో ఈ పరిస్థితిని ఎదుర్కొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో హౌసింగ్ బోర్డు అభివృద్ధి

నిధుల లేమితో నేడు ఇబ్బందులు పడుతున్న ప్రజలు

- కలెక్టర్ నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపం
- పాఠశాల, ఆసుపత్రి స్థలాలను స్వాధీనం చేసుకోవాలి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ: బీఆర్‌ఎస్ పాలనలో హౌసింగ్‌బోర్డు ఎంతో అభివృద్ధి చెందిందని, నేడు నిధుల లేమితో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కార్పొరేటర్ మందడి శ్రీనివాస రావుతో కలిసి బుధవారం కేపీహెచ్‌బీ డివిజన్‌లోని పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి అధికారులతో సమీక్షించారు. ముందుగా 5వ ఫేజ్ వద్ద, మలేషియన్ టౌన్‌షిప్ ప్రాంతంలో డ్రైనేజీ సమస్యను ప్రజలు వివరించారు. అనంతరం రెండేళ్ల క్రితం 100 పడకల ఆసుపత్రి కోసం శంకుస్థాపన చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. నిధులు మంజూరైనా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే ఆసుపత్రి నిర్మించడంలో జాప్యం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుపేదలకు ఉపయోగపడే పనులు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అలసత్వానికి ఉదాహరణే ఈ పాఠశాల నిర్మాణ జాప్యం అని ఆవేదన వ్యక్తం చేశారు. హౌసింగ్ బోర్డు నుంచి ఎటువంటి అభ్యంతరం లేకపోయినా పనులు చేపట్టడానికి ప్రభుత్వం, కలెక్టర్ ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. ప్రజలకు ఉపయోగపడే పనులను పూర్తి చేయాలని కోరారు. అనంతరం వార్డు కార్యాలయంలో అసోసియేషన్ సభ్యులు, అధికారుల సమీక్ష సమావేశంలో అసోసియేషన్ సభ్యులు అందించిన వినతిపత్రాలను స్వీకరించారు. పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు, చిన్న పిల్లలు ఆడుకునే పరికరాలను మరమ్మతులు చేపించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కో ఆర్డినేటర్ సతీష్ అరోరా, డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, రాజేష్, అన్ని విభాగాల అధికారులు, నాయకులు, కార్యకర్తలు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



కేపీహెచ్‌బీ డివిజన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీ రోడ్డు నెంబర్4లో పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ 32వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ఉదయం లక్ష్మి గణపతి స్వామి వారికి సహస్ర ఘటాభిషేకం, నవగ్రహ హోమం, మహా సుదర్శన హోమం, సాయంత్రం 6 గంటలకు కల్పవృక్ష వాహన సేవ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన నేతలు

ఆల్విన్‌కాలనీ: కార్మిక, మైనింగ్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మంత్రి గడ్డం వివేక వెంకటస్వామిని ఐఎన్‌టీయూసీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బాబర్ సలీం పాషా నేతృత్వంలో బుధవారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ జనరల్ సెక్రటరీ భాస్కర్‌రెడ్డి, జంట నగరాల అధ్యక్షులు అదిల్ షరీఫ్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్ యాదవ్, జనరల్ సెక్రటరీ నాగన్న గౌడ్ పాల్గొన్నారు.



నేడు ఆలయ 8వ వార్షికోత్సవం

- విద్యుత్ దీపాలతో ఆలయ అలంకరణ



ముస్తాబైన ఆలయం

మోతీనగర్: మూడు దశాబ్దాల క్రితం మూసాపేట డివిజన్ అవంతినగర్ తోట కాలనీ ఆవిర్భవించింది. కాలనీ ఏర్పాటు సమయంలో కాలనీలో ఒక చోట స్థలం ఉండటంతో ఆ స్థలంలో కాషాయపు జెండాను ఏర్పాటు చేసి అక్కడే ఉగాది, దసరా, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి, గురు పౌర్ణమి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించేవారు. కాలక్రమేణా మందిరం ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. శ్రీ విఘ్నేశ్వర, నాగేంద్ర, సుబ్రహ్మణ్యేశ్వర, దత్తాత్రేయ, నవగ్రహ అభయాంజనేయ, ఉమా మహేశ్వర దేవత సహిత శ్రీ సద్గురు సాయినాథుని దేవాలయం నిర్మాణానికి 2009 సంవత్సరంలో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 2015 సంవత్సరంలో ఆలయ పునర్‌నిర్మాణ పనులు ప్రారంభించారు. 2017లో ఆలయ నిర్మాణం పూర్తికావడంతో జూన్ నెలలో ప్రారంభించారు. కోరిన కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకం. గురువారం ఆలయం 8వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. గణపతి పూజ, సకల దేవతా మూర్తులకు పంచామృతాభిషేకం, అనంతరం దేవతా మూర్తులకు ప్రత్యేక అలంకరణ, నూతన వస్త్ర అలంకరణ, 12 గంటలకు సాయిబాబా మహా హారతి, అనంతరం భక్తులకు అన్నదానం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ వార్షికోత్సవ పూజల్లో పాల్గొని విజయవంతం చేయాలని దేవాలయ కమిటీ, అవంతినగర్ తోట రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు.

నివాళులర్పించిన నేతలు

మోతీనగర్: మూసాపేట డివిజన్ కబీర్‌నగర్‌కి చెందిన కాంగ్రెస్ నాయకులు ఆనంద్ రెడ్డి సోదరుడు నాగన్న మృతి చెందారు. విషయం తెలుసుకున్న మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ బుధవారం కబీర్‌నగర్‌లోని నాగన్న మృతదేహంపై పూలమాలేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో తిరుపతి, శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్, రాంబాబు, చింటూ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్పలో నీటి సమస్యపై బుధవారం జలమండలి కార్యాలయంలో ఆ కాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు. కొన్ని నెలలుగా తమ కాలనీలో తీవ్ర నీటి సమస్య ఉందని, వీలైనంత తొందరగా పరిష్కరించాలని మాజీ అధ్యక్షులు ప్రభాకర్ కోరారు. అంతేకాకుండా విద్యుత్ బిల్లు అధికంగా వస్తుందని, దీనిపై కూడా చర్చించి ఉచితంగా నీటి సరఫరా అయ్యేట్లు చూడాలని కాలనీ వాసులు కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

మూసాపేట: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి వివేక్‌నగర్‌లో నివాసం ఉండే ఎం. పవన్‌కుమార్ (49) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో నిత్యం మందు తాగి బాధపడుతూ ఉండేవాడు. మంగళవారం రాత్రి కూడా మద్యం సేవించి మనస్సు బాగోలేదని బెడ్ రూమ్‌లో ఒక్కడే పడుకోగా.. కుటుంబ సభ్యులు హాల్‌లో పడుకున్నారు. ఉదయం తలుపు తీసేందుకు కుటుంబ సభ్యులు ప్రయత్నించగా తలుపులు తీయలేదు. వెంటనే 100కు డయల్ చేసి పోలీసుల సహాయంతో తలుపులు తెరిచి చూడగా.. ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని కనిపించాడు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేపీహెచ్‌బీ కాలనీ గృహ సముదాయాలకు రిజిస్ట్రేషన్ చేయాలి

- టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్



మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బండి రమేష్

కూకట్‌పల్లి: నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసమై టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ రెవెన్యూ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, హౌసింగ్ బోర్డు ఎండీ గౌతమ్‌లను బుధవారం వారి కార్యాలయాల్లో కలిశారు. ప్రధానంగా నియోజకవర్గ పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ గృహ సముదాయాల రిజిస్ట్రేషన్లు ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉండడాన్ని వారి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్థానిక నివాసుల సౌకర్యార్థం వాటిని రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం హై లెవెల్ కమిటీని నియమించాలని కోరారు. హౌసింగ్ బోర్డు ఇళ్లు లబ్ధిదారులకు కేటాయించి సంవత్సరాలు గడిచినా ఇప్పటికి రిజిస్ట్రేషన్ కాకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 630 అల్పాదాయ వర్గాల గృహాలతో పాటు 270 సంపూర్ణ గృహాలు, హిందూ ప్రాజెక్టులోని విల్లాలు, ప్లాట్స్, మంజీరా ప్లాట్స్ కేవలం చిన్న కారణాలతో రిజిస్ట్రేషన్స్ ఆగిపోయాయని వివరించారు. అదే విధంగా జేఎన్‌టీయూ పక్కన ఉన్న సాయి నగర్ ప్లాట్స్ రిజిస్ట్రేషన్ చిక్కో ప్రాజెక్టు విషయంలోనూ త్వరగా నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ మేరకు వారికి వినతిపత్రం సమర్పించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు తగు సూచనలు ఇచ్చినట్లు బండి రమేష్ పేర్కొన్నారు.

వన్‌టైమ్ చాన్స్ పరీక్షలు.. 900 మంది హాజరు

కేపీహెచ్‌బీకాలనీ: వన్‌టైమ్ చాన్స్ పరీక్షలు రాయడానికి వచ్చిన అభ్యర్థులతో జేఎన్‌టీయూ ప్రాంగణం సందడిగా మారింది. వివిధ కారణాలతో బీటెక్, ఎంటెక్, ఎం ఫార్మసీ, బీ ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏలను సకాలంలో ఉత్తీర్ణులు కాలేకపోయిన వారికి గత నెల 21వ తేదీ నుంచి జేఎన్‌టీయూలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 26వ తేదీతో పరీక్షలు ముగియనున్నాయి. బుధవారం అత్యధికంగా 900 మంది పరీక్షలు రాయడానికి వచ్చిన వారితో పాటు పిల్లలు, కుటుంబ సభ్యులు వచ్చారు. సివిల్, మెకానికల్, ఈఈఈ, స్పందన బ్లాక్‌లలో పరీక్షలు రాశారు. పరీక్షల ఫీజుల రూపంలో ఆదాయం వస్తున్నప్పటికీ కనీసం మంచినీటి సౌకర్యం కల్పించలేదని అభ్యర్థుల వెంట వచ్చిన వారు వాపోయారు.

రోడ్డు విస్తరణతో ట్రాఫిక్ సమస్యకు చెక్



అభివృద్ధి పనులపై సూచనలు చేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ, జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్

- పీఏసీ చైర్మన్ గాంధీ
- జోనల్ కమిషనర్, కార్పొరేటర్లతో కలిసి పర్యటన

ఆల్విన్‌కాలనీ: రోడ్డు విస్తరణతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని, పనులు ప్రారంభించి పూర్తి చేయాలని పీఏసీ చైర్మన్ గాంధీ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్, హైదర్‌నగర్ డివిజన్‌ల పరిధిలోని ఉషా ముళ్లపూడి కమాన్ నుంచి గాజుల రామారం వరకు ఎల్లమ్మబండ ప్రధాన రహదారి 100 ఫీట్ల రోడ్డు విస్తరణ, బాగ్ అమీర్ పెట్రోల్ బంక్ నుంచి హైదర్‌నగర్ మహేంద్ర షోరూం వరకు జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్డు పునరుద్ధరణ, మిత్ర హిల్స్ నుంచి ఎన్‌టీఆర్ సర్కిల్ వరకు రోడ్డు విస్తరణ పనులు, లేక్ వ్యూ బార్ నుంచి నవోదయ కాలనీ మీదుగా ప్రేమ్ సరోవర్ వరకు నూతన రింగ్ రోడ్డు చేపట్టాలని జోనల్ కమిషనర్‌కు ఇటీవలే వినతిపత్రం అందజేశారు. బుధవారం జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, కార్పొరేటర్లతో కలిసి పర్యటించారు. రోడ్డు విస్తరణ పనులపై అధికారులకు సూచనలు, సలహాలు తెలియజేశారు. రోడ్డు మధ్యలో అడ్డంకిగా ఉన్న ఎలక్ట్రికల్ స్తంభాలను త్వరగా తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, నార్నే శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ గణపతి, ఇంజినీరింగ్ అధికారులు ఈఈ గోవర్ధన్, ఏఈ రాజీవ్, శ్రావణి, నిఖిల్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు మహదేవ్, రవికుమార్, గురువా రెడ్డి, ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్ అధికారులు డీఈ జనప్రియ, ఏఈ దయానంద్, ఏడీఈ లైన్స్ మధుకర్, ఏఈ కరుణ్‌కుమార్, వీధి లైట్లు డీఈ స్వప్న, ఏఎంఓహెచ్ శ్రీనివాస్, ఎస్‌ఆర్‌పీ నాయక్ పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని సీసీ రోడ్ల నిర్మాణ పనులు, ఉద్యానవనం ప్రారంభోత్సవానికి గురువారం ఉదయం 9:30 గంటలకు పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. మహంకాళి నగర్ ఆశానగర్ కాలనీలోని కార్పొరేటర్ కార్యాలయం వద్ద ఉన్న ప్రాంతంలో సీసీ రోడ్ల నిర్మాణం, శాతవాహన నగర్‌లోని పార్కు ప్రారంభోత్సవం కార్యక్రమాలు జరుగుతాయని కార్పొరేటర్ కార్యాలయ సిబ్బంది తెలిపారు.



రాందేవ్‌రావ్ ఆసుపత్రిలో మార్చురీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ తదితరులు

రాందేవ్‌రావ్ ఆసుపత్రిలో మార్చురీ యూనిట్ ప్రారంభం

కూకట్‌పల్లి: రాందేవ్‌రావ్ ఆసుపత్రిలో రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మార్చురీ యూనిట్‌ను పీఏసీ చైర్మన్ గాంధీ రాందేవ్‌రావ్ కుమారుడు విక్రమ్ దేవ్‌రావు, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ సభ్యులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉస్మానియా, గాంధీ, నిమ్స్ వంటి ఆసుపత్రుల్లో ఉండే మార్చురీ యూనిట్ రాందేవ్‌రావ్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసుకోవటం గొప్ప విషయమన్నారు. సామాజిక దృక్పథంతో మార్చురీ యూనిట్‌ను ఏర్పాటు చేసిన రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ హైదరాబాద్ వారిని అభినందిస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ గ్రేటర్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్, చార్టర్ ప్రెసిడెంట్ కిలారు వేణుబాబు, ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, సెక్రటరీ శివరామకృష్ణ, డైరెక్టర్ కమ్యూనిటీ సర్వీసెస్ విజయ్ భాస్కర్, డాక్టర్ యోబు, నాయకులు సంజీవరెడ్డి, ఎండీ ఇబ్రహీం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

4,291 రైతులకు రూ.2.57 కోట్ల రైతు భరోసా

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనుచౌదరి



సాక్షి,సిటీబ్యూరో: తొలకరి ప్రారంభంలోనే రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు వేసి వారి ముఖాల్లో తెలంగాణ ప్రభుత్వం సంతోషాన్ని నింపిందని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి తెలిపారు. రైతు భరోసా పథకం కింద జిల్లాలో 4,291 మంది రైతుల ఖాతాల్లో రూ. 2.57 కోట్లు జమ అయినట్లు పేర్కొన్నారు. విడుతల వారీగా రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నిధులు పడతాయని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. పంట సాగు కోసం రైతు భరోసా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వానాకాలం సాగు ప్రారంభానికి ముందే ప్రభుత్వం రైతు భరోసా నిధులు అందించడంపై అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతుందన్నారు.

పథకాల అమలులో ఉద్యోగుల పాత్ర కీలకం

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అర్హులైన ప్రజలకు అందించటంలో ఉద్యోగుల పాత్ర కీలకమని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. బుధవారం ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ, తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ ప్రతినిధులు మర్యాపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు రవి ప్రకాష్, కార్యదర్శి భరత్ కుమార్, కోశాధికారి శేషసాయి గిరికాంత్, జిల్లా కార్యవర్గ సభ్యులు అశ్విని, అత్తారి, నాగరాజు, వినయ్‌కాంత్, కలెక్టరేట్ యూనిట్ ప్రతినిధులు కార్తిక్, కిషోర్, లక్ష్మయ్య, లింగాల అక్షయ్ కుమార్, ఉమా కాంత్, చంద్రకాంత్, లక్ష్మీ ప్రసన్న, ప్రకాష్ పాల్గొన్నారు.

టీబీ లక్షణాలుంటే వైద్యులను సంప్రదించాలి

కూకట్‌పల్లి: టీబీ ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం జగద్గిరిగుట్టలోని యూపీహెచ్‌సీ ఆసుపత్రిలో టీబీ వ్యాధిగ్రస్తులను ఏఐ ఎక్స్‌రే ద్వారా 175 మందిని స్క్రీనింగ్ చేశారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డా. ఎస్. శ్రవణ్ చౌదరి మాట్లాడుతూ.. రెండు వారాల కంటే ఎక్కువ కాలం నిరంతరం దగ్గు, దగ్గినప్పుడు రక్తం, శ్లేషం రావడం, శ్వాస తీసుకున్నప్పుడు, దగ్గుతున్నప్పుడు ఛాతి నొప్పి, బరువు తగ్గడం, అలసట, బలహీనత, జ్వరం సాయంత్రం వేళల్లో రావటం, రాత్రి పూట చమటలు రావటం, ఆకలి లేకపోవటం, శ్వాస ఆడకపోవటం ఇటువంటి లక్షణాలు ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మోహన్, రామకృష్ణ, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఆసుపత్రి వైద్యులు శ్రవణ్‌చౌదరి, ఆసుపత్రి సిబ్బంది